విశాలాంధ్ర

ప్రకాశం బాపట్ల

గురువారం 23 జనవరి 2025 8 పేజీలు

ఉపాధి కల్పించి వలసలు నివారించండి

- ఏపీ వ్య.కా.స రాష్ట్ర గౌరవాధ్యక్షులు జల్లి విల్సన్
- జేసీ, డ్వామా పీడీతో జిల్లాలో వలసల పరిస్థితులపై చర్చ
- నివాస ప్రాంతాల్లో 200 రోజులు పనిదినాలు కల్పించాలి
- రూ.700 కూలి ఇవ్వాలని వినతి

2లో

సినీ సంగీత దర్శకులు వందేమాతరం శ్రీనివాసులును బుధవారం కలిసిన జిల్లా ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆర్ రామకృష్ణ తోపాటు బేతాళ శ్రీనివాసరావు హనుమంతరావు తదితరులు

-విశాలాంధ్ర, ఒంగోలు

సంక్షేమ హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

- పేదలకు నాణ్యమైన ప్రభుత్వ వైద్యం అందాలి
- జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా చూడండి
- అధికారులతో సమీక్షించిన మంత్రి, ఎంపీ
- ఎర్రగొండపాలెం సమస్యలు మంత్రికి దృష్టికి

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : పేద పిల్లలు చదువుకుంటున్న సంక్షేమ హాస్టళ్ళ నిర్వహణలో గానీ, ఉత్తమ పరీక్ష ఫలితాలు రాబట్టడంలో గానీ నిర్లక్ష్యం వహిస్తే సహించబోనని రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి స్పష్టం చేశారు. బుధవారం ఆయన ప్రకాశం భవనంలో సాంఘిక సంక్షేమ, వైద్య ఆరోగ్య, తాగునీటి సరఫరా శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిందారు. పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు, ఉగ్ర నరసింహారెడ్డి కందుల నారాయణరెడ్డి, ముత్తుమల అశోక్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ. తమీమ్ అన్సారియాలతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్ళ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 143 కోట్ల రూపాయలను హాస్టళ్ళ మరమ్మతుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో మరమ్మతు పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా హాస్టళ్ళ నిర్మాణం అవసరంపైనా ఆయన ఆరా తీశారు. సంక్షేమ హాస్టల్లోని సిబ్బంది, ట్యూటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ హాస్టల్లో పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ దిశగా మరింత దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. వచ్చిన ఫలితాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. హాస్టల్లోని విద్యార్థులకు రెగ్యులర్గా ఆరోగ్య పరీక్షలు చేయాలని పునరుద్ఘాటించారు. ఖాళీలు ఉన్న చోట విద్యార్థుల సామాజిక తరగతితో

మిగతా 2 లో ...

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్

ప్రగతిని చాటి చెప్పేలా జాతీయ పండుగను అధికారులు ఘనంగా నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. గణతంత్ర దినోత్సవం నిర్వహణపై అధికారులతో బుధవారం కలెక్టరేట్లో మాట్లాడారు.

- విశాలాంధ్ర - బాపట్ల

8 లో

కిలాడి లేడీ అరెస్ట్

వృద్ధ మహిళలకు మత్తుమందు ఇచ్చి మరీ ఆభరణాల చోరీ

వృద్ధ మహిళలకు మత్తు మందు ఇచ్చి వరుస దొంగతనాలకు పాల్పడుతున్న కిలాడి లేడీని పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.35 లక్షల విలువైన బంగారు నగలతో పాటు, మత్తు టాబ్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

6లో

-విశాలాంధ్ర, ఒంగోలు

రహదారి భద్రతా నియమాలను పాటించడం అందరి బాధ్యత

విశాలాంధ్ర-ఒంగోలు : రహదారి భద్రతా నియమాలను పాటించడం మనందరి బాధ్యత అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. రహదారి భద్రత మాసోత్స వాలలో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలులో కళాశాల విద్యార్థులతో నిర్వహించిన "వాక్ థావ్" ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కర్నూల్ రోడ్‌లోని ఫ్లైఓవర్ ఇంక్షన్ వద్ద ప్రారంభమైన ఈ వాక్ థాన్ పట్టణ పురవీధుల గుండా చర్చి సెంటర్ వరకు సాగింది. ఈ వాక్ దాన్‌లో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, జిల్లా కలెక్టర్ శ్రీమతి వి.తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పీ వీ.ఆర్.దామోదర్, డి.టి.సి.శ్రీమతి ఆర్. సుశీల పాల్గొన్నారు.

వేమూరు మార్కెట్ యార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

రైతు ప్రయోజనాలు కాపాడే విషయంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలియజేశారు. బుధవారం మార్కెట్ యార్డులో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.

- విశాలాంధ్ర, వేమూరు :

5 లో

మార్టూరులో సినీ ఫక్కీలో చోరీ

మార్టూరులో బుధవారం పట్టపగలే చోరీ జరిగింది. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో రహదారిపై నిలిచిన కారు అద్దం పగులగొట్టి అందులో ఉన్న రూ.1.20 లక్షల నగదును చోరీ చేశారు.

8లో

- విశాలాంధ్ర, మార్టూరు

ఉపాధి కల్పించి వలసలు నివారించండి

- ఏపీ వ్య.కా.స రాష్ట్ర గౌరవాధ్యక్షులు జల్లి విల్సన్
- జేసీ, డ్వామా పీడీతో జిల్లాలో వలసల పరిస్థితులపై చర్చ
- నివాస ప్రాంతాల్లో 200 రోజులు పనిదినాలు కల్పించాలి
- రూ.700 కూలి ఇవ్వాలని వినతి

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : జిల్లాలో వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించి వలసలు నివారించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ తెలిపారు. జిల్లాలోని కూలీల వలసల పరిస్థితులను జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, డ్వామా పీడీ విజయలక్ష్మితో చర్చించి జిల్లాలో వలసలు కట్టడి చేయాలని కోరారు. స్వంత గ్రామాల్లో పనులు లేక పల్లెలు మూటలు కట్టుకుని సుదూర ప్రాంతాలకు వలసపోతున్నారన్నారు. ఎక్కువశాతం పల్లెలు కూలీలు లేక వెలవెలబోతున్నాయన్నారు. జీవనం సాగించేందుకు పిల్లలను వెంట తీసుకుని వెళ్లటం వలన చదువుకు దూరమవుతున్నారన్నారు. వ్యవసాయ కూలీల విషయంలో అశ్రద్ధ చేయకుండా మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏర్పాటు చేసిన ఉద్దేశాన్ని పక్కాగా అమలు చేయాలని కోరారు. ప్రస్తుత జీవన పరిస్థితుల దృష్ట్యా కూలీలకు చెల్లించే నగదు రూ.700కు పెంచాలని కోరారు. ప్రతి కూలీకి 200 రోజులు పనిదినాలు కల్పించటం వలన స్వంత గ్రామాల్లోనే కుటుంబ సమేతంగా నివాసం ఉంటూ పిల్లలను చదివించుకోవటంతో పాటు వృద్ధాప్యంలో ఉన్న వారిని చూసుకునే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో ప్రధానంగా అద్దంకి నియోజకవర్గం సంతమాగులూరు మండలంలో రెండు రోజుల క్రితం పదుల సంఖ్యలో కూలీలు వాహనాల్లో వలసలు వెళ్లారన్నారు. అదేవిధంగా బాపట్ల మండలం చుండూరుపల్లి, కర్లపాలెం మండలం పెదపులుగువారిపాలెం, నర్రావారిపాలెం, సమ్మెటవారిపాలెం, పేరలి గ్రామాల్లో అత్యధికంగా వ్యవసాయ కూలీలు వలసలు పోతున్నారన్నారు. వ్యవసాయ పనులు పూర్తి అవటం వలన కూలీల పూటగడవక ఇబ్బందులు పడుతున్నారని త్వరితగతిన గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పనులు ప్రారంభించాలన్నారు. అదేవిధంగా కూలీలకు పని ప్రదేశంలో మౌళిక వసతులు కల్పించి పనిసామాగ్రి ఇవ్వాలని కోరారు. అధికారులకు వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జేబీ శ్రీధర్ ఉన్నారు.

మీటర్ రీడర్స్ సమస్యలు పరిష్కరించాలి

విద్యుత్ శాఖ ఎస్ఈకి వినతి పత్రం అందజేసిన ఏఐటీయూసీ నాయకులు

విశాలాంధ్ర-ఒంగోలు : మీటర్ రీడర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాని ఏఐటియుసి జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జిల్లాలోని విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్స్ సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నగర సమితి ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ఎస్ఈని కలిసి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొత్తకోట మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎస్ఈ స్పందిస్తూ ప్రధానంగా ఎస్కో అకౌంట్ ద్వారా జీతాలు అందించేలా చర్యలు తీసుకుంటామని ఈపీఎఫ్ ఈఎస్ఐ సక్రమంగాకట్టే విధంగా కాంట్రాక్టర్ల తోటి యూనియన్ నాయకులతోటి మీటింగ్ చేయించి తమ పరిధిలోని సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే ప్రతినెల మొదటి వారంలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించడం జరిగింది. కార్యక్రమంలో యూనియన్ నగర నాయకులు శ్రీరామ్ శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శికె. సిద్దయ్య నాగార్జునరెడ్డి,దత్తు, మాణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలు విజయవంతం చేయండి

- డీఎస్సీ విడుదల చేయాలి
- నిరుద్యోగ భృతి ప్రకటించాలి
- వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి
- ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.ప్రభాకర్ పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు : అఖిల భారత యువజన సమైక్య (ఏఐవైఎఫ్) ప్రకాశం జిల్లా 16వ మహాసభలు ఈనెల 26వ తేదీన ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.ప్రభాకర్ తెలిపారు. స్థానిక మల్లయ్య లింగం భవన్లో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ప్రభాకర్ మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు కూటమి ప్రభుత్వం అనేక హామీలను యువతకు ఇచ్చిందని, ఆ హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. యువతకు ఉపాధి కల్పన చేయకుండా యువతను మోసం చేస్తుందని ఆయన ధ్వజమెత్తారు. అలానే విద్యా, వైద్యం, ఉపాధి, ప్రాథమిక హక్కులుగా రాజ్యాంగంలో పొందుపరిచినప్పటికీ, విద్య వైద్యం వ్యాపారాలు అయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువత ఉపాధి అవకాశాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. సమగ్ర యువజన విధానం భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ స్కీం, నూతన పరిశ్రమల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే ఇవ్వాలని ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని తదితర అంశాలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యచరణ రూపొందించి నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభలకు జిల్లాలోని యువత, వాలంటీర్స్ అధిక సంఖ్యలో పాల్గొని ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామంజి యాదవ్, సుబ్బారావు, అశోక్, బెంజిమెన్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వద్దు

(మొదటిపేజీ తరువాయి)

సంబంధం లేకుండా అడ్మిషన్లు మంజూరు చేయాలని మంత్రి చెప్పారు. దివ్యాంగులైన విద్యార్థులు పెన్షన్ల కోసం ప్రతి నెల వారి స్వగ్రామాలకు వెళ్లకుండా ఆన్లైన్లోనే పెన్షన్ డబ్బులను వారి ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినందున ఈ దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలోని ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని, మాతా శిశు మరణాలు తగ్గించాలని, ఆసుపత్రులలో ప్రసవాలు పెంచాలని, ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని మంత్రి ఆదేశించారు. గుండెపోటు సంభవించినప్పుడు తక్షణమే ప్రమాదాన్ని నివారించడానికి ఇంజక్షన్ వేసి స్టెమీ ప్రాసెస్ పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో తాగునీటి సరఫరా అవుతున్న తీరును మంత్రి అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఆగస్టు వరకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సాగర్ జలాలను మరో విడత విడుదల చేయనున్నారని, వాటితో చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని మంత్రి చెప్పారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ మార్కాపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గతంలో 800 ఉన్న ఓపీలు ప్రస్తుతం 200లకు తగ్గిపోయాయని అన్నారు. ఆసుపత్రులకు వచ్చే రోగులపై శ్రద్ధ పెట్టకుండా వైద్యులు ప్రైవేట్ గా ప్రాక్టీస్ చేస్తున్నారని చెప్పారు. శానిటరీ వర్కర్ ను ఏజెంట్గా పెట్టుకుని దివ్యాంగుల పెన్షన్ కోసం నకిలీ సర్టిఫికెట్లను వైద్యులు మంజూరు చేశారని ఎమ్మెల్యే చెప్పారు. ఇప్పటివరకు సదరు శానిటరీ వర్కర్ పైన చర్యలు తీసుకోలేదని ఆయన అన్నారు. దీనిపై సూపరింటెండెంట్‌ను మంత్రి వివరణ కోరగా డీ.ఎం. ఈ.తో మీటింగ్ ఉండడంతో సూపరింటెండెంట్ రాలేదని, అందుకే తాను వచ్చానని డిప్యూటీ సూపరింటెండెంట్ చెప్పడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి, కలెక్టర్ సమీక్ష నిర్వహిస్తుంటే డి.ఎం.ఈ. రాకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీక్ష సమావేశాలకు ఉన్నతాధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలోని తాగునీటి బోర్వెల్స్ ను రిపేరు చేయించాలని ఎమ్మెల్యే కోరాడు. పొదిలి ప్రాంతానికి వారానికి 30 గంటల పాటు చేస్తున్న తాగునీటి సరఫరాను కనీసం 48 గంటలకు పెంచాలని కోరారు. కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ పామూరు సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి కనిగిరికి డిప్యూటేషన్ పైన వేసిన గైనకాలజిస్ట్ అక్కడ విధులు నిర్వహించడంలేదని, పామూరుకు కూడా తిరిగి రాలేదని, చెప్పకుండా విధులకు గైర్హాజరైన ఆమెపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరాడు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ రిమ్స్ ఆసుపత్రి పై వచ్చే నెల మొదటి వారంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు. దాతల సహాయంతో ఆసుపత్రిని మరింతగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. మోటార్లు పనిచేయకపోవడం వలన మద్దిపాడు, ఒంగోలు, కొత్తపట్నం మండలాల్లోని సుమారు 50 గ్రామాలకు మంచినీటి సరఫరాలో 17 రోజులపాటు సమస్య తలెత్తినదని అన్నారు. ఇలాంటి సమయంలో ఉపయోగపడేలా స్పేర్ భాగాలను ముందుగానే ఎందుకు అందుబాటులో పెట్టుకోలేదని అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక ఏరియా ఆసుపత్రిలో రేడియాలజిస్టు, పీడియాట్రీషియన్, అనస్థీషియా వైద్యులను నియమించాలని కోరారు. ఆ ఆసుపత్రిలో ఉన్న నియో నాటల్ కేర్ యూనిట్ ను స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్గా అప్గ్రేడ్ చేయాలని, కంభం ఆసుపత్రిలో డాక్టర్ పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని పలు గ్రామాలలో 500 అడుగుల కంటే లోతులో ఉన్న బోర్వెల్స్ మాత్రమే పనిచేస్తున్నాయని, వేసవిని దృష్టిలో పెట్టుకుని అన్ని బోర్వెల్స్ కు మరమ్మతులు చేయాలని భూగర్భ నీటిమట్టాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ వివిధ భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులను తన ఎంపీ ల్యాప్స్ నుంచి కేటాయిస్తానని, ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు చెప్పారు. దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ గతంలో దర్శిలోని ప్రభుత్వ ఆసుపత్రికి మదర్ బ్లడ్ బ్యాంక్గా చీరాల ఉండేదని, కొత్త జిల్లా ఏర్పడిన దృష్ట్యా మదర్ బ్లడ్ బ్యాంకును కూడా ప్రస్తుత జిల్లాలోనే అనుసంధానం చేస్తే బాగుంటుందని అన్నారు. దర్శి ఆసుపత్రిలో తాత్కాలిక మార్చురీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్.ఏ.పి. ప్రాజెక్టులోని ఫిల్టర్ బెడ్లు దెబ్బతిన్నందున వాటిపై దృష్టి పెట్టి సరి చేయించాలని కలెక్టర్ ను కోరారు. ఎర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ వేసవిలో తమ ప్రాంతంలో మంచినీటికి తీవ్ర ఎద్దడి ఉంటుందన్నారు. ఈ దృష్ట్యా ఇప్పటినుంచే అలాంటి గ్రామాలను గుర్తించి తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయించడంపై దృష్టి పెట్టాలని కలెక్టర్ ను కోరారు. దోర్నాలలోని గిరిజనుల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి అవసరమైన నిధులను కేటాయించి నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని మంత్రిని కోరారు. ఎర్రగొండపాలెం లోని ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాత్ ల్యాబ్ ఏర్పాటు చేయటానికి దాతలు సుముఖంగా ఉన్నారని, ఇందుకు అవసరమైన భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మా నాయక్, ఎస్.సి. కార్పొరేషన్ ఈ.డి. అర్జున్ నాయక్, ఏ.పి.ఎస్.డబ్ల్యు.ఆర్.ఈ.ఐ.ఎస్. కో-ఆర్డినేటర్ జయ, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏ.డి. అర్చన, డీఎంహెచ్ఓ టి.వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ సూరిబాబు, ఇరిగేషన్ ఎస్.ఈ. వరలక్ష్మి, ప్రాజెక్ట్స్ ఎస్.ఈ. బాల మురళ మోహన్, ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్.ఈ. బాల శంకర రావు పాల్గొన్నారు.

ఉల్లాస్ వయోజన విద్య పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కందుల

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండల కేంద్రమైన కొనకనమిట్లలోని వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ వయోజన విద్యా పోస్టర్ పుస్తకాలను మంగళవారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నారాయణరెడ్డి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలలోని చదువు లేని మహిళలకు సాయంత్రం సమయాల్లో ఉచితంగా విద్య నేర్పించడం జరుగుతుందన్నారు. డ్వాక్రా సంఘాలలోని చదువు లేని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వెలుగు ఏపీఎం సుధాకర్ వయోజన విద్య సూపర్వైజర్ చెన్నారెడ్డి మాట్లాడుతూ మొదటి విడతగా 1146 మంది మహిళలను అక్షరాస్యులు చేయాలని లక్ష్యంగా ప్రభుత్వము ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఈశ్వరమ్మ,సూపర్వైజర్లు సాయిలు లక్ష్మిరెడ్డి, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

రబీ సీజన్‌లో పంటలకు ఇన్సూరెన్స్ తప్పనిసరి

విశాలాంధ్ర-వెలిగండ్ల : రైతులు రబీ సీజన్లో పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని కనిగిరి వ్యవసాయ సంచాలకులు ఈవి రమణ కోరారు. మంగళవారం మండలంలోని జిల్లాపాలెం, గుడిపాటి పల్లె గ్రామాలలో వ్యవసాయ శాఖ పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్లో పంట ఇన్సూరెన్స్ చేసుకున్న రైతులు తమ ఇన్సూరెన్స్ అప్లికేషన్లను సంబంధిత రైతు సేవ కేంద్రం సిబ్బందికి అందజేసి కచ్చితంగా ఈ పంట నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. అందుకోసం ప్రతి రైతు తమ పట్టాదారు పాసుబుక్కు జిరాక్స్ ఆధార్ కార్డు, బ్యాంక్ పాసుబుక్ జిరాక్స్ కాపీలను తీసుకొని రైతు సేవ కేంద్రం సిబ్బందిని కలిసి సంప్రదించి ఈ గుర్తింపు సంఖ్యను పొందవలసిందిగా తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రంగా కృష్ణ, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ వెన్న రమణారెడ్డి, యూనిట్ ఇంచార్జ్ ముక్కు వెంకటేశ్వర్ రెడ్డి మండల ఎస్సీ సెల్ నాయకులు గోన వెంకటయ్య ఏఈఓలు దద్దాల పుల్లారావు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద ప్రపంచానికి ఆదర్శం

విశాలాంధ్ర - గిద్దలూరు : గిద్దలూరు మండల కేంద్రంలోని రామకృష్ణ ధ్యాన మందిరం నందు తిథి నక్షత్రాల ప్రకారం స్వామి వివేకానంద జయంతి ఘనంగా పూనూరు హనుమంతారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1500 సంవత్సరాలకు సరిపడ జ్ఞానాన్ని ప్రపంచానికి అందించారన్నారు. యువతకు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో నిలిచారన్నారు. గుణవంతుడు జ్ఞానవంతుడు శీలవంతుడు మూడు ఉన్నాయి కాబట్టి ఇప్పటికి ఆయనను ఆదర్శంగా తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణ రెడ్డి సంఘ సేవకులు ప్రథమ స్వాతంత్ర్య సమర యోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ వారు, బ్రహ్మారెడ్డి, వెంకటరామిరెడ్డి వీరారెడ్డి మల్లారెడ్డి రామకృష్ణ ధ్యానమందిరం అధ్యక్షులు పోలయ్య, రామచంద్రారెడ్డి వంగల ప్రసూనలక్ష్మి లింగారెడ్డి, మార్కాపురం రాంభూపాల్ రెడ్డి,రమేష్ రెడ్డి పాల్గొన్న భక్తులకు విశ్రాంత చీఫ్ ఇంజనీర్ ఈదుల రంగారెడ్డి భోజనం ఏర్పాటు చేశారు. అనేకమంది మహిళా భక్తులు పురుషులు పాల్గొన్నారు.

డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర-వెలిగండ్ల : ఆటో డ్రైవర్లు, వాహన చోదకులు నిబంధనలు పాటించకపోతే తగు చర్యలు తప్పవని వెలిగండ్ల ఎస్సై మధుసూదన్ రావు సూచించారు. మంగళవారం మండల పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఆటో డ్రైవర్ తో ఆయన మాట్లాడుతూ ఆటోలు వాహన సోధకులు నిబంధనలను పాటించాలని పరిమితికి మించి ఆటోలో ప్యాసింజర్ ఎక్కించుకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు నేడు అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున సూచనలు పాటించి ప్రజలను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేర్చాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ ఆటో డ్రైవర్లు వాహన చోదకులు పాల్గొన్నారు.

ప్రధాన అధికారులు లేక పాలన అస్తవ్యస్థం

విశాలాంధ్ర - తాళ్లూరు: ఎంపీడీఓ, తహసీల్దార్లు సెలవులపై వెళ్లటంతో ప్రధాన అధికారుల నియామకంలో జాప్యంతో పాలన అస్తవ్యస్థంగా తయారు అయినది. ఎంపీడీఓ, ఈఓఆర్డీ అయిన కల్లూరి సుందర రామయ్య, తహసీల్దార్ సంజీవ రావులు సెలవుపై వెళ్లటంతో గత వారం రోజుల నుండి కార్యాలయం పనులు కుంటు పడ్డాయి. ఇన్చార్జీల నియా మకంలో ఉన్నతాధికారులు మీన మేషాలు లెక్కిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎఫ్ఏసీ అధికారులను నియమించి ప్రజా పాలన గాడిన పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చలువాది నాగేశ్వరరావుకు ఘన నివాళి

విశాలాంధ్ర-చీమకుర్తి : ప్రముఖ పారిశ్రామికవేత్త స్వర్గీయ చలువాది నాగేశ్వరరావుకి దశదిన కార్యక్రమంలో జిల్లాలోని ప్రముఖులు ఘన నివాళు లర్పించారు. ప్రముఖంగా సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బి.ఎన్.విజయకుమార్, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, చీరాల వైసీపీ ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి, ఒంగోలు గెలక్సీ అధినేత చలువాది బద్రీనారాయణ, కృష్ణ సాయి గ్రానైట్స్ శిద్దా భరత్, వివా గ్రానైట్స్ నవీన్ రెడ్డి, డాక్టర్ మారం వెంకారెడ్డి, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్ రెడ్డి ప్రముఖులందరూ కూడా నివాళులర్పించారు. ప్రముఖ పరిశ్రామిక వేత్త పెరల్స్ గ్రానైట్స్ అధినేత చలువాది వెంకట నాగరాజా ధర్మపత్ని శ్రీదేవి,సాకేత్ రామానుజ, చలువాది కుటుంబ సభ్యులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. చీమకుర్తి ఒంగోలు ప్రభుత్వ హాస్పిటల్ లో మరియు ఒంగోలు గాంధీ బొమ్మ వద్ద, శ్రీ సత్యసాయి సమగ్ర విద్యా కేంద్రంలో, విద్యాసంస్థల్లో విద్యార్థులకు అన్న సంతర్పణ చేశారు. అంతేకాకుండా ఒంగోలు,పొదిలి, నైమిశారణ్యం,వనపర్తి, పాల్వంచ, గోశాల వద్ద గోవులకు ఆహారాన్ని అందజేశారు. పలు ప్రాంతాల్లో పేదవారికి వస్త్రాలను పంచిపెట్టారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గుచూపాలి

వ్యవసాయ అధికారి వెంకటరమణ

విశాలాంధ్ర-సింగరాయకొండ : పకృతి వ్యవసాయ విధానంలో తక్కువ ఖర్చుతో అన్ని రకాల పంటలు వేయడం వల్ల అధిక దిగుబడులతో రైతుకు ఆదాయం చేకూరుతుందని కనుక రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు రావాలని మండల ప్రకృతి వ్యవసాయ అధికారి వెంకటరమణ ఆధ్వర్యంలో మంగళవారం కలికివాయ గ్రామ పొలాలలో ప్రయోగాత్మకంగా నిరూపించడం జరిగింది. ఈ నేపథ్యంలో ఆయన సింగరాయకొండ మండల కలికివాయ గ్రామంలోని చిడిపూడి నరసారెడ్డి 8 ఎకరాల 50 సెంట్లు విస్తీర్ణములో ఎ గ్రేడ్ మోడల్ వేయడం జరిగింది. ప్రధాన పంట పెసర వాటిలో అంతర పంటలు 1.అలసంద 2. ఆముదం 3. నువ్వులు 4. సన్ ఫ్లవర్ 5. అవాలు 6. మినుము 7. ధనియాలు 8. సరిహద్దు పంట జొన్న వేయడం జరిగిందని పేర్కొన్నారు. అదేవిదంగా ప్రకృతి వ్యవసాయం విధానంలో తెగుళ్ళ నివారణకు బీజామృతమ్ముతో విత్తనశుద్ధి చేయడం జరిగింది. ఈ పద్ధతి చేయడం వల్ల తక్కువ ఖర్చుతో అన్నిరకాల పంటలు అధిక దిగుబడులతో అదాయం పొంద గలరు రైతు సోదరులు ప్రయోగాత్మకంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ సిబ్బందితో పాటు రైతులు పాల్గొన్నారు.

40 కుటుంబాలకు పుట్టగొడుగుల తయారీ శిక్షణ

విశాలాంధ్ర-రాచర్ల : గిద్దలూరు డిపి డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్ నిషాకుమారి వారి ఆదేశాల ప్రకారం తిరుమలలో అధికారి వారి ఆధ్వర్యంలో ఆకవీడు వన సంరక్షణ సమితి సభ్యులకు మరియు ఎస్సీ, ఎస్టీ కాలనీ 40 కుటుంబములకు శ్రీ బాలస్వామి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ పుట్టగొడుగుల ట్రైనర్లు పిలిపించి ఆకువీడు గ్రామం నందు శిక్షణ ఇప్పించడం జరిగింది. ఈ శిక్షణ పది రోజులు ఉంటుంది ఒక పంట నలభై రోజులు పెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వయం ఉపాధి శిక్షణ ఇవ్వడం జరుగుచున్నది. ఈ కార్యక్రమంలో తుమ్మెళ్ళ ఫారెస్ట్ రేంజ్ అధికారిని శ్రీమతి బి మధు ప్రియాంక, డిఆర్ఓ డి బాలాజీ నాయక్ బీట్ అధికారి తేజ రిసోర్స్ పర్సన్ జాన్ వైస్ చైర్పర్సన్ శ్రీమతి ప్రసన్న కుమారి మరియు వి ఎస్ఎస్ సభ్యులు గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.

ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలో కంచిపల్లి గ్రామంలో మండల వ్యవసాయాధికారి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ నేషనల్ పెస్ట్ సర్వేలయన్స్ సిస్టమ్ అప్లికేషన్ మీద రైతులకు అవగాహన కల్పించారు. ఈ అప్లికేషన్ ద్వారా రైతులు నేరుగా పొలాల్లోకి వెళ్లి పురుగులు, తెగుళ్లు ఫోటో తీసిన వెంటనే వాటి నివారణ చర్యలు రావడం జరుగుతుంది కావున దీని వలన రైతులు పురుగులు, తెగుళ్లను గుర్తించి వాటికి సంబంధించిన మందులు పిచికారీ చేయవచ్చును అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర ప్రభుత్వము తీసుకొచ్చిన "ఫార్మర్ రిజిస్ట్రీ " కార్యక్రమాన్ని గురించి రైతులకు వివరించి, దీని ద్వారా ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను (ఐడి నంబర్) కేటాయించటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి విష్ణు ప్రియ మాట్లాడుతూ మినీ ట్రాక్టర్లు, తైవాన్ స్ప్రేయర్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.గ్రామ సభ అనంతరం శనగ పంటలు క్షేత్ర స్థాయిలో పరిశీలన గావించి ఆ పంటలలో వచ్చు చీడ పీడలు, వాటి నివారణ చర్యలు రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు నబీ యూనస్ పాల్గొన్నారు.

ఎఫ్ఆర్టీఐ జిల్లా అధ్యక్షుడిగా రమేష్ మట్ట

విశాలాంధ్ర-ఒంగోలు : ఫోరమ్ ఫర్ ఆర్టీఐ ప్రకాశం జిల్లా అధ్యక్షులుగా విద్యావంతులు కొలకలూరి రమేష్‌ని నియమిస్తున్నట్లు జాతీయ ఉపాధ్యక్షులు మట్ట ప్రసాద్ బుధవారం ప్రకటించారు. జాతీయ అధ్యక్షులు ప్రతిపాటి చంద్రమోహన్ సూచనల మేరకు ప్రకాశం జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని నీతి నిజాయితీగా బలోపేతం చేయడానికి ప్రశ్నించే ధైర్యం ఉన్న విద్యావంతుడు రమేష్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. త్రైక్వాండోలో జాతీయ క్రీడా విజేత గా నిలిచి ఎన్.ఐ.ఎస్ స్థాయికి ఎదిగి రాష్ట్ర డిజిపి క్యాంప్ రికార్డుల్లో చోటు సంపాదించు కొన్న కొలకలూరి రమేష్ ప్రకాశం జిల్లా ఉప్పుగుండూరు గ్రామ వాసి అని చెప్పారు. ప్రభుత్వ సహకారంతో సమాచార హక్కు చట్టంపై అణగారిన వర్గాల ప్రజలకు అవగాహన కల్పించటం జరుగుతుందని మట్ట తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వం చేయాల్సిన పని ఎఫ్ ఆర్టీఐ చేస్తున్నదని కనుక ప్రభుత్వ అధికారులు కూడా తమ సంస్థ ద్వారా ఆర్టీఐ పరిరక్షణలతో పాటు ప్రచారం చేయవచ్చని వివరించారు. అవినీతిని నిర్మూలించేందుకు తమవంతు బాధ్యతగా పౌరులు ముందుకు రావాలని, తమ సంస్థ లో చేరేందు కు 9676211151 నీ సంప్రదించాలని కోరారు.

నాగంపల్లిలో ఉచిత పశు వైద్య శిబిరం

పశు వైద్యాధికారి రాజ్యలక్ష్మి

విశాలాంధ్ర-కొనకనమిట్ల : కొనకనమిట్ల మండలంలోని నాగంపల్లి గ్రామంలో గొట్లగట్టు పశు వైద్య అధికారిని వి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు టిడిపి నాయకులు స్థానికుమువెంకటేశ్వర రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పశువుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కూటమి ప్రభుత్వం ఉచిత పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తుందని అన్నారు. పశువైద్యాధికారిని రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఉచిత పశువైద్య శిబిరాలు అన్ని గ్రామాల్లో నిర్వహించడం జరుగుతుందని, పశువులకు టీకాలు వేసి చూడు పరీక్షలు నిర్వహించామన్నారు. పశువులకు గొర్రెలకు మేకలకు నట్టల నివారణ మందును తాగించడం జరిగిందన్నారు. ఆరోగ్య సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ వరలక్ష్మి, పశుసంవర్ధక సహాయకులు మేఘావత్ శివాజీ నాయక్, బి.శ్రీనివాసులు ,ఓ.ఎస్ కాసు వెంకటేశ్వర్ రెడ్డి పశుపోషకులు పాల్గొన్నారు.

రైతుల పొలాలకు ప్రత్యేక గుర్తింపు

విశాలాంధ్ర-వెలిగండ్ల : రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను వ్యవసాయ శాఖ ఇవ్వడం జరుగుతుందని వ్యవసాయ అధికారి రంగాకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని కంకణంపాడు వెలిగండ్లలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను వారి పొలానికి ఇవ్వడం జరుగుతుంది అని అందుకుగాను ప్రతి రైతు పొలం పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ కాపీలను రైతు సేవా కేంద్రం నందు సిబ్బందికి అందజేసి గుర్తింపు సంఖ్యను పొందాలని కోరారు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పీఎం కిసాన్ రిజిస్ట్రేషన్ కు ప్రత్యేక గుర్తింపు సంఖ్య అవసరమవుతుందని తెలిపారు రైతులు వరి సెనగ అలసంద పంటలలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని, ఇన్సూరెన్స్ చేసుకొని పంట నమోదు చేసుకోకపోతే మీరు గుర్తింపు రాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలిగండ్ల, కంకరపాడు రైతులు పాల్గొన్నారు.

నిరుద్యోగం పెంచుతున్న మోదీ ప్రభుత్వం

- నిరుద్యోగ భృతి ఇవ్వని చంద్రన్న ప్రభుత్వం
- ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.కరుణానిధి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : కేంద్రంలో నరేంద్ర మోడీ ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వకుండా దేశవ్యాప్తంగా నిరుద్యోగతను పెంచి పోషిస్తున్నారని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.కరుణానిధి విమర్శించారు. అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ యర్రగొండపాలెం నియోజకవర్గ మహాసభ బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన కరుణానిధి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం దేశంలో నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో ఘోరంగా విఫలం కావడంతో పాటు నిరుద్యోగం రికార్డ్ స్థాయిలో పెంచుతున్నారని, సమగ్ర యువజన విధానం ద్వారా నిరుద్యోగ సమస్య నిర్మూలించవచ్చని అన్నారు. ధనవంతుల సంపద పున పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వంతో రాయితీలు తీసుకొని కోట్లాది రూపాయలు ప్రజల సొమ్మును దోచుకుంటున్న ధనవంతుల సంపదను ప్రజలకు పంపిణీ చేయాలని నినాదంతో ఏవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రచార నిర్వహిస్తామని తెలిపారు. ధనవంతులకు బ్యాంకు రుణాలు రుణమాఫీ చేస్తూ ప్రజలపై భారం మోపడం సిగ్గుచేటు అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ఫ్రీ జోన్ చేసి అక్కడ భర్తీ చేసే ఉద్యోగాల్లో 26 జిల్లాల నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయలతో అమరావతి అభివృద్ధి చేస్తున్నారని, రాజధాని అన్ని ప్రాంతాల ప్రజలకు సంబంధించింది కాబట్టి అక్కడ భర్తీ చేసే ఉద్యోగాలు కూడా అందరికీ భాగస్వామ్యం ఉండాలని, గతంలో హైదరాబాద్ ఫ్రీ జోన్ కావడం ద్వారా రాష్ట్రవ్యాప్త నిరుద్యోగులకు లబ్ధి చేకూర్చిందని తెలిపారు. జనవరి 26న ఒంగోలులో జిల్లా మహాసభ జరుగుతుందని ఈ మహాసభలో సమగ్ర యువజన విధానం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, ప్రభుత్వ రంగ సంస్థలపరిరక్షణ, ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల నూతన నోటిఫికేషన్ల, వివిధ అంశాలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. అనంతరం యర్రగొండపాలెం నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. కన్వీనర్‌గా యద్దనపూడి కోటయ్య, కో కన్వీనర్లుగా కే వెంకటేశ్వర్లు, టి.శ్రీను, నెంబర్లుగా వై.యేసుబాబు, డి.ఆదిత్య లను ఎన్నుకోవడం జరిగింది. ఈ మహాసభలో ఏఐవైఎఫ్ మాజీ నాయకులు డి శ్రీనివాస్, కెవి కృష్ణ గౌడ్, టీసీఎచ్ చెన్నయ్య, బాణాల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లగుంట్లలో పశు ఆరోగ్య శిబిరాలు

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండలం నల్లగుంట గ్రామంలో బుధవారం పశు ఆరోగ్య శిబిరాల క్యాంప్‌ను పశు వైద్య చికిత్సకులు డాక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపిటిసి సిఎచ్. వెంకటేశ్వరరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మండలంలోని అన్ని పంచాయతీలలో ఈ పశు ఆరోగ్య వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. మనుషులకే కాదు పశువుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లుగా వెంకటేశ్వర రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ ఇంద్రజ, పశు సంవర్ధక శాఖ సహాయకులు పాలుగుళ్ల మోహన్ రెడ్డి, రావూరి చంద్రశేఖర్ , ఖాజాబీ, జ్ఞాన ప్రసన్న తదితరులు పాల్గొన్నారు. పశువులకు టీకాలు చేస్తూ అలాగే పశువులకు నట్టల నివారణకు మందు తాపుతూ పశువులకు అనారోగ్యం కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను డాక్టర్ వి వినోద్ కుమార్ రైతులకు వివరించి చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జ్యోతి రెడ్డి, పంకు రాజగోపాల్, బొడ్డు పెద్ద రంగయ్య, వేల్పుల మహేంద్ర, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వామివారి ఆభరణాలు తనిఖీ చేసిన దేవాదాయ శాఖ అధికారులు

విశాలాంధ్ర-పామూరు : పట్టణంలోని శ్రీ మదన వేణుగోపాలస్వామి, శ్రీవల్లి భుజంగేశ్వర స్వామి వార్లకు రాజుల కాలంలో శ్రీకాళహస్తి మహారాజు, తరువాత కాలములో భక్తులు ఇచ్చిన బంగారు, వెండి ఆభరణాలను దేవాదాయ ధర్మాదాయ కార్యనిర్వాహణాధికారి శ్రీగిరిరాజు నరసింహబాబు పర్యవేక్షణలో బుధవారం దేవాదాయ శాఖ జ్యువెలరీ విభాగం సహాయ కమిషనర్ శ్రీనివాసులు తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. చేయడం జరిగింది బుధవారం తనిఖీ చేయడం జరిగింది. స్వామివార్లకు ఆభరణాలు ఇవ్వదలచిన భక్తులు ధర్మకాట తూకం రసీదుతో కార్యనిర్వాహధికారిని సంప్రదించి రశీదు తీసుకొని రికార్డులో నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ జాయింట్ కమిషనర్ సుబ్బారావు,కనిగిరి నియోజకవర్గం బిజెపి కన్వీనర్ కొండశెట్టి వెంకట రమణయ్య మాజీ పాలక మండలి చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు, సభ్యులు సిద్దవటం నరసింహరెడ్డి, టీడీపీ నాయకులు బండ్ల నారాయణ, బజరంగ్ దళ్ సభ్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పుట్టా సుబ్బారావు

విశాలాంధ్ర - కనిగిరి : అఖిలభారత యువజన సమైక్య ఏఐవైఎఫ్ ప్రకాశం జిల్లా 16వ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పుట్టా సుబ్బారావు పిలుపునిచ్చారు. కనిగిరి పట్టణంలోని స్థానిక దరిశి చెంచయ్య భవనం నందు బుధవారం ఏఐవైఎఫ్ సమావేశం నిర్వహించి ఈనెల 26వ తారీఖున ఒంగోలు పట్టణంలోని స్థానిక మల్లయ్య లింగం భవన్ నందు జరగబోయే ఏఐవైఎఫ్ ప్రకాశం జిల్లా16వ మహాసభల కరపత్రాన్ని విడుదల చేశారు. పుట్టా సుబ్బారావు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు తీర్చిదిద్దడంలో యువత పాత్ర కీలకమైందని నాడు బ్రిటిష్ పాలకులను తరిమికొట్టేందుకు నాటి యువత సర్దార్ భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవ్ చంద్రశేఖర్ ఆజాద్ కీలక పాత్ర పోషించారని. స్వతంత్రం అనంతరం ప్రభుత్వాలు యువతను నిర్లక్ష్యానికి గురి చేస్తూ దేశ పురోగతిలో భాగస్వామ్యం కల్పించని నేపథ్యంలో 1959 మే 3న ఢిల్లీలో అఖిలభారత యువజన సమైక్య ఏఐవైఎఫ్ స్థాపనకు నాంది పలికిందని అన్నారు. ఏఐవైఎఫ్ ప్రకాశం జిల్లా 16వ మహాసభలు జనవరి 26వ తేదీన ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్ నందు జరుగుతాయని ఈ మహాసభలను జిల్లాలోని యువతీ యువకులు నిరుద్యోగ యువత వాలంటీర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ పవన్ కుమార్ కన్వీనర్ ఇఫ్రాజ్ ఏఐటీయూసీ నాయకులు ఖాసీం పీరా పాల్గొన్నారు.

వేమూరు మార్కెట్ యార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

విశాలాంధ్ర - వేమూరు : రైతు ప్రయోజనాలు కాపాడే విషయంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలియజేశారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులకు కావాలసిన ఎరువులు అందుబాటులో ఉంచేందుకు మార్కెట్ యార్డులో ఎరువులు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎరువుల కోసం రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని తగినమేర ఎరువులు అందుబాటులో ఉండే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో తెనాలిలో ఉన్న వేమూరును ప్రత్యేక మార్కెట్ యార్డుగా నెలకొల్పడం జరిగిందన్నారు. ఆనాడు తాము చేసిన అభివృద్ధి తప్ప గత ఐదేళ్లలో వేమూరు మార్కెట్ యార్డులో ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదని విస్మయం వ్యక్తం చేశారు. అది కాక గత ప్రభుత్వంలో ఇసుక డంపింగ్ యార్డుగా వినియోగించి యార్డు ప్రహరీ గోడల సైతం ధ్వంసం చేశారని విమర్శించారు. రాబోయే రోజుల్లో వేమూరు మార్కెట్ యార్డును ఆదర్శంగా తీర్చిదిద్దే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా రైతులకు ఎరువులు అందజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ జెడి కే. శ్రీనివాస రావు, మార్కెట్ మేనేజర్ కరుణ, డిసిఎంఎస్ మేనేజర్ హరగోపాల్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు గొట్టిపాటి భాను గంగాధర్, జనసేన నాయకులు రాజేష్, అమ్మిశెట్టి కిషోర్, మండల వ్యవసాయ అధికారి సునీత, టీడీపీ నాయకులు వేమూరి మురళీకృష్ణ, మన్నే పసి, షేక్ అనీఫ్, యోబు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తను పరామర్శించిన 'గాదె'

విశాలాంధ్ర - చిన్నగంజాం : మండలంలోని కడవకుదురు గ్రామ వైసీపీ కార్యకర్త ధనరాజ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న పర్చూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త, రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదనరెడ్డి ధనరాజ్‌ను బుధవారం పరామర్శించారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షుడు, వైసీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు వాడకం తగ్గించాలి

విశాలాంధ్ర - చిన్నగంజాం : మండల పరిధిలోని చింతగుంపల, కడవకుదురు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి కె.భాస్కర్‌రావు బుధవారం నిర్వహించారు. పంట సాగు చేస్తున్న ప్రతి రైతు బీమా తీసుకోవాలన్నారు. బీమా తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలను రైతులతో సమావేశమై వివరించారు. అనంతరం స్థానిక పొలాలను పరిశీలించి పంట పొలాలలో పురుగు మందులు ఎక్కువ వాడకూడదన్నారు.

ప్రతి గృహం జియోట్యాగ్ చేయించుకోవాలి:కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : గృహాల సర్వేలో మిగిలిపోయిన వారంతా సచివాలయాలలో తక్షణమే తమ పేర్లు నమోదు చేసుకోవాలని కలెక్టర్ జె.వెంకట మురళి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి గృహం జియోట్యాగ్ చేయించుకోవాలని ఆయన సూచించారు. ఆధార్ కార్డులు లేని వారు తక్షణమే ఆధార్ నమోదు కేంద్రాలకు వెళ్లి నమోదు చేయించుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల రామకోటేశ్వరరావు

విశాలాంధ్ర - మార్టూరు : ధాన్యం కందులు మినుములు మొక్కజొన్న పంటల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల రామకోటేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కమిటీ సమావేశం పి.నాగేశ్వరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు కందిమల్ల రాంకోటేశ్వరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు పంటలు కొనుగోలు చేయాలని వరి ధాన్యం క్వింటాకు 2,340 కందులు7750 మొక్కజొన్న 2,340 ప్రకటించిన మద్దతు ధరకే కొనుగోలు చేయాలన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు జనవరి 26వ తేదీ దేశవా దేశవ్యాప్త పిలుపులో భాగంగా ట్రాక్టర్లు ద్విచక్ర వాహనాల ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఈ.నాగేశ్వరరావు, బి. కృష్ణమూర్తి, వై.రాంబాబు, బి. సూరిబాబు, మోహన్‌రావు, డి.సాంబశివరావు, శేషాద్రి, ఎన్.సాంబయ్య, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ విధుల్లో అలసత్వం వద్దు

ఎంపీడీవో షేక్ మహబూబ్ బాషా

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ బాషా బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు వంద రోజులు పని కల్పించుట, ప్రతి గ్రామ పంచాయతీలో 25 ఫారం పాండ్స్, ప్రతి గ్రామ పంచాయతీకి 50 సోక్ పిట్స్, తదితర విషయాలపై ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించి తగు సూచనలు జారీ చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి మిస్సింగ్ సిటిజన్స్, ఓడిఎఫ్ ప్లస్ సర్వే, ఏపీ సేవ, సర్వీసెస్ అమౌంట్, కమ్యూనిటీ అసెట్స్ తదితర విషయాలపై సమీక్ష నిర్వహించి తగు సూచనలు ఇచ్చారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు అందజేస్తున్న ప్రతి సంక్షేమ పథకం గురించి ప్రజలకు వివరించి అవగాహన కల్పించి లబ్ధి చేకూరే విధంగా చూడాలని ఆదేశించారు సమయపాలన పాటించని సచివాలయ సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో శ్రీనివాస్ నాయక్, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు ఇంటర్వ్యూ వాయిదా

విశాలాంధ్ర-కురిచేడు : కురిచేడు ఎన్ఎస్పి కాలనీలో ఉన్న అంగన్వాడి సెంటర్‌లో ఖాళీగా ఉన్న కార్యకర్త పోస్టుకు దరఖాస్తులు కోరగా దరఖాస్తులు చేసుకున్న వారికి నేడు గురువారం కనిగిరి ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూ జరగవలసి ఉండగా ఈ ఒక్క పోస్టుకు మాత్రమే ఇంటర్వ్యూ వాయిదా వేసినట్లు దర్శి సిడిపిఓ భారతి పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. మిగిలి ఉన్న ఊర్లలో ఖాళీగా ఉన్న పోస్టులకు యధావిధిగా ఇంటర్వ్యూలు జరుగుతాయని ఆమె తెలియజేశారు ఈ పోస్ట్ కు సంబంధించి తదుపరి తెలియజేస్తామని పత్రికా ప్రకటనతో తెలియజేశారు.

అక్రమ మద్యం విక్రయదారులు అరెస్టు

విశాలాంధ్ర - అద్దంకి : కొరిశపాడు మండలంలో బుధవారం అద్దంకి ఎక్సైజ్ అధికారులు మద్యం బెల్ట్ దుకాణాలపై దాడులు నిర్వహించారు. అక్రమంగా మద్యం అమ్ముతున్న కొరిశపాడుకు చెందిన మంగళపూడి సాయి కృష్ణారెడ్డి, తూర్పు తక్కెళ్ళపాడుకు చెందిన మేడా ఎలమందను అరెస్టు చేసి వారి వద్ద అమ్మకానికి ఉంచిన 21 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు అద్దంకి ఎక్సైజ్ సీఐ ఏ.భవాని తెలిపారు. దాడులలో ఎక్సైజ్ పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండలంలోని విజయనగర్ కాలనీ, ఈపురు పాలెం గ్రామాల్లో మండల వ్యవ సాయ అధికారి ఐ.సుమతి ఆధ్వ ర్యంలో నిర్వహించారు. నేషనల్ పెస్ట్ సర్వలెన్స్ సిస్టం అప్లికేషన్‌పై రైతులకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని రైతులకు వివరించారు. ప్రతి రైతుకు ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను కేటాయించటం జరుగుతుందన్నారు. వెబ్ లాండ్‌లో పొలం ఉన్న ప్రతి రైతు సమీప రైతు సేవా కేంద్రంను సంప్రదించి పొలం పాస్ పుస్తకం, ఆధార్ కార్డు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకొని యూనిక్ ఐడి పొందాలన్నారు. యూనిక్ ఐడి పొందినవారు మాత్రమే ప్రభుత్వ పథకాలకు అర్హులు అవుతారని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏఓ సరిత, వ్యవసాయ సహాయకులు ధీరజ్, ఆఫియాలు, రైతులు పాల్గొన్నారు.

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : రైతులు తమ పొలాలలో మట్టి నమూనాలు తీసి భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయశాఖ అధికారి ఎన్.మేరమ్మ అన్నారు. మండలంలోని విజంనంపాడు, చిమటవారిపాలెం, గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి భూసార పరీక్షలు చేయించుకోవాలని, అధికారులను సంప్రదించి సిఫారసు మేరకు ఎరువులు వాడుకొని భూమి కాపాడుకోవాలని బీడు భూములను జిప్సంతో బాగు చేసుకోవాలన్నారు. భూమి ఆరోగ్యాన్ని కాపాడవలసిన బాధ్యత రైతు పై ఉంటుందని, రసాయన ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. పొగాకులో పచ్చు తెగుళ్ళ నివారణకు అధికారులు సూచనల మేరకు మందులు వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, నరేంద్ర, వినయ్ రైతులు వజ్జా సుబ్బరామయ్య, గండువీర శంకర్‌రావు, గండు గోపి కృష్ణలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

విశాలాంధ్ర - వేమూరు : మొక్కజొన్న, జొన్న పంటలలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని బాపట్ల కృషి విజ్ఞాన కేంద్రం ఏడిఏ అక్తర్ హుస్సేన్ తెలియజేశారు. బుధవారం మండలంలోని చంపాడు, బూతమల్లి గ్రామాల్లో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు జొన్న, మొక్కజొన్న పంటల్లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. కత్తెర పురుగు నివారణకు సస్య రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సిహెచ్ సునీత, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు ఉన్నారు.

విశాలాంధ్ర epaper.visalaandhra.com గురువారం 23 । జనవరి । 2025

విద్యకు అత్యధిక ప్రాధాన్యత :మంత్రి డోలా

విశాలాంధ్ర-ఒంగోలు : విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. ఒంగోలు నగరంలో 6 కోట్ల 15 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న బాలికల నూతన వసతి గృహాలకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామదర్ల జనార్ధన రావు, కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, ఒంగోలు మేయర్ శ్రీమతి గంగాడ సుజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఒంగోలు నగరంలో 30 కోట్ల రూపాయల వ్యయంతో విద్యార్థుల కోసం వసతి గృహాలను నిర్మిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం బాలికల వసతి గృహాన్ని 6 కోట్ల 15 లక్షలరూపాయల వ్యయంతో నిర్మిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని వసతి గృహాలకు 143 కోట్ల రూపాయల వ్యయంతో మరమ్మత్తులు చేస్తున్నామన్నారు. బాలురకు కూడా వసతి గృహం నిర్మిండానికి ప్రస్తుతం తూర్పుపాలెంలో ఉన్న స్థలాన్ని పాఠశాలకు దగ్గరకు ఎక్సేంజ్ చేసిలా చర్యాలు తీసుకుంటామన్నారు. హాస్టల్ పిల్లల భద్రత, ప్రాంగణంలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. హాస్టల్ పిల్లలకు అవసరమైన దుప్పట్లు, పెండింగ్లో ఉన్న మెస్ బిల్లులు చెల్లిందామన్నారు. ఎం.పి. మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తోందన్నారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో కూడా నూతన హాస్టల్స్ నిర్మాణం చేపడుతోందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ వసతి గృహంలో 600 మంది విద్యార్థినులకు వసతి కల్పించడం జరుగుతుందన్నారు. ఒక సంవత్సరంలోగా నిర్మాణం పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కలెక్టరు మరియు మేయర్ మాట్లాడుతూ బాలికల విద్యాభివృద్ధికి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాడని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మా నాయక్, ఎస్.సి. కార్పొరేషన్ ఈ.డి. అర్జున్ నాయక్, ఏ.పి.ఇ.డబ్ల్యు.ఐ.డి.సి. ఈ.ఈ. భాస్కర బాబు, అధికారులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-కొండపి : మహిళా మార్ట్ ఏర్పాటు కోసం తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి రవికుమార్ తెలిపారు. కొండపిలోని డి ఆర్ డి ఏ వెలుగు కార్యాలయంలో జిల్లా ప్రాజక్ట్ డైరెక్టర్ టి రవికుమార్ బుధవారం సందర్శించి ఏపి యం , సిసిలు విఓఏ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు . ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం లో జరుగుచున్న ప్రాజక్ట్ కార్యక్రమాలు ప్రోగ్రెస్ పై సంతృప్తి వ్యక్తం చేశారు. మహిళా మార్ట్ ఏర్పాటు కొరకు తగు చర్యలు తీసుకోవాలని స్టాఫ్ కి ఆదేశాలిచ్చారు. ప్రతి సభ్యురాలికి వాటా దనం కట్టించి వాటా దారులు చేయాలన్నారు. ఈ మార్ట్ ఏర్పాటుకు భవనాన్ని త్వరగా గుర్తించాలన్నారు. వెలుగు శాఖ ద్వారా ప్రభుత్వం చేపట్టి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అందుకొనే విధముగా స్వయం సహాయక సంఘాల సభ్యులను మరింత చైతన్యం చేయాలని సిబ్బంది సూచించారు. పొదుపులు, పుస్తక నిర్వహణ సక్రమముగా చేయాలన్నారు. ముఖ్యముగా మహిళల జీవనోపాధి కొరకు అందిస్తున్న సామాజిక పెట్టుబడి రుణాలు , స్త్రీ నిధి రుణాలు, ఎస్సీ ఎస్టీలకు ఇస్తున్న ఉన్నతి రుణాలు విడుదల చేయడం లో చొరవ తీసుకోవాలని కోరారు. రుణాల విడుదల తో పాటుగా రికవరీ లు కూడా 100 శాతం ఉండే విధముగా చర్యలు తీసుకోవాలన్నారు. రికవరీ లు సక్రమంగా చెల్లించని వారికి నోటీస్ లు జారీ చేయాలన్నారు. ప్రాజక్ట్ కి సంబంధించిన అన్ని పనులు చేయుటకు గ్రామ సంఘం స్థాయి లో వివో ఏ లు వారి విధుల పట్ల భాద్యతగా పని చేయాలని ఆదేశాలు జారీచేశారు నిర్లక్ష్యంగా ఉన్న వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ కె. కళ్యాణ్ ఏపియం బి. గోపినాథ్ సిసిలు డి.మల్లిఖార్జునరావు వి. కృష్ణారావు కె.రామాంజనేయులు అకౌంటెంట్ జి. కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కిలాడీ లేడీ అరెస్ట్

❑ వృద్ధ మహిళలకు మత్తుమందు ఇచ్చి ఆభరణాల చోరీ

❑ రూ. 35 లక్షల విలువైన బంగారు ఆభరణాలతో పాటు, మత్తు టాబ్లెట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

విశాలాంధ్ర -ఒంగోలు: వృద్ధ మహిళలకు మత్తు మందు ఇచ్చి వరుస దొంగతనాలకు పాల్పడుతున్న కిలాడి లేడీ ని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితురాల నుండి రూ. 35 లక్షల విలువైన బంగారు నగల తో పాటు, మత్తు టాబ్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ దామోదర్ కేసు తాలూకు వివరాలను మీడి యాకు వివరించారు. ఎస్పీ కథనం మేరకు ఒంగోలు మండలం దేవరం పాడు గ్రామానికి చెందిన గంటా ఏలిసమ్మ వృద్ధ మహిళలకు మత్తు టాబ్లెట్లు ఇచ్చి బంగారు నగలను దొంగతనం చేస్తుందని తెలిపారు. ముద్దాయి గతంలో విజయవాడలో ఒక చోరీ కేసులో అరెస్ట్ అయి, జైలుకు వెళ్లి వచ్చిందన్నారు. టీవీలో వస్తున్న సీరియల్ చూసి నిద్ర మాత్రలు ఇచ్చి సులువుగా దొంగ తనాలు చేయవచ్చు అని నిర్ణయించు కుందన్నారు. ఒక మానసిక డాక్టర్ని కలిసి తన ఆరోగ్యం బాగాలేదని, నిద్ర పట్టటానికి మాత్రలు కావాలని ప్రిస్క్రిప్షన్ తీసుకుని నిద్రమాత్రలు కొనుగోలు చేస్తుందన్నారు. పెళ్లిళ్లు వంటి కార్యక్రమాలకు వెళ్ళినప్పుడు ఒంటరి మహిళలను టార్గెట్ చేసి, వారికి మాయమాటలు చెప్పి, తెలిసిన మహిళల మెలిగి, నమ్మకం వచ్చేలా ఒకటి రెండు రోజులు వాటిని ఇంటికి వెళ్లి ఎక్కువ మోతాదులో నిద్ర టాబ్లెట్లు కూల్ డ్రింక్స్ లో కలిపి ఇచ్చి, వారు గాఢ నిద్రలోకి చేరుకున్న తర్వాత బంగారు నగలు దొంగతనం చేసేదని తెలిపారు. బంగారు షాపులలో బంగారం కొనడానికి వెళ్లి, దొంగతనం చేస్తుందన్నారు. ఈ క్రమంలో ముద్దాయి టంగుటూరు, కొత్తపట్నం, ఒంగోలు తాలూకా, ఒంగోలు వన్ టౌన్, టూ టౌన్, నాగులుప్పలపాడు, కందుకూరు పట్టణ స్టేషన్ల పరిధిలో మతికి 9 దొంగతనాలు, బంగారు షాపులలో రెండు దొంగతనాలు చేసిందన్నారు. ఈ కేసులో ఇద్దరూ వృద్ధ మహిళలు కూడా మరణించారు అన్నారు. ముద్దాయిని ఒంగోలులోని బాలాజీ నగర్ లో బుధవారం అదుపులోకి తీసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. ముద్దాయి నుండి రూ. 35 లక్షల విలువైన 450 గ్రాముల బంగారు ఆభరణాలు, మత్తు టాబ్లెట్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముద్దాయిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

శనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర - అద్దంకి : శనగ పంటలో పచ్చ పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో వెంకటకృష్ణ అన్నారు.బుధవారం నాగులపాడు,వేలమూరిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.శనగలో కాయ తొలుచు పురుగు నివారణ కొరకు ఇమా మెక్టిన్ బెంజోయేట్ పురుగుమందులను పిచికారి చేసుకోవాలని సూచించారు.త్వరలో ప్రతి రైతుకి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయబోతున్నామని దీని ద్వారానే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఏవో తెలిపారు.కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు అనూష,వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మరాజుపాలెం,చిననందిపాడుల్లో.....

విశాలాంధ్ర-పర్చూరు: శనగ పంటలో వచ్చే చీడపీడల నివారణకు పంట మార్పిడి విధానం అవసరమని సహాయ వ్యవసాయ సంచాలకులు నాగభైరు మోహనరావు తెలిపారు. మండలంలోని తిమ్మరాజుపాలెం, చిననందిపాడు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ శనగ పంటలో వచ్చే తెగుళ్ళ నివారణకు జొన్న, మొక్కజొన్న, సజ్జ పైరులు వేయాలని రైతులకు అవగాహన కలిగించారు. రైతులు విత్తన శుద్ధితో పాటు భూసార పరీక్షలు చేయించుకోవాలిని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ గిరి, ఝాన్సీ, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

ఆరేపల్లి తూర్పుపాలెంలో....

విశాలాంధ్ర - చెరుకుపల్లి : అపరాలలో అక్కడక్కడ పల్లాకు తెగులు కనిపిస్తుందని మండల వ్యవసాయ అధికారి ఏ.మహేష్ బాబు అన్నారు. బుధవారం ఆయన ఆరేపల్లి తూర్పుపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లాకు తెగులు నివారణకు వేప నూనె 5 ఎం.ఎల్ నీటికి కలిపి గానీ ఐదు శాతం యాప గింజల కషాయం గాని పిచికారి చేసుకోవాలని తెలియజేశారు. అలాగే ఈ నెలాఖరులోపు అందరూ రైతులు రబీ పంట నమోదు,ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి దాసరి మాధవి,గ్రామ వ్యవసాయ సహాయకులు,రైతులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ అనుమతి వస్తే రుణాల దరఖాస్తులను ప్రారంభిస్తాం

నీలం నాగేంద్రకు తెలిపిన మంత్రి స్వామి

విశాలాంధ్ర-ఒంగోలు: ఫైనాన్స్ అనుమతి రాగానే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కార్పొరేషన్ల రుణాలకు దరఖాస్తు చేసుకునే సైట్ ప్రారంభి స్తామని, యూనిట్లు గ్రౌండ్ చేస్తామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ప్రకటించారు. బుధవారం కలెక్టరేట్లో వివిధ శాఖల సమీక్షకు హాజరైన మంత్రి స్వామితో దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు మాట్లాడారు. కార్పొరేషన్ రుణాల గురించి చర్చించారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కార్పొరేషన్ల లోన్ యూనిట్ల సంఖ్యను పెంచాలని, రుణాలకు దరఖాస్తు చేసుకు నేందుకు ఆన్లైన్ ఓపెన్ చేయాలని నాగేంద్రరావు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామిని కోరారు. ఈ సందర్భంగా నాగేంద్ర మంత్రితో మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ 912 యూనిట్లు, బీసీ కార్పొరేషన్ 1094 యూనిట్లు, ఎస్టీ కార్పొరేషన్ కేవలం 113 యూనిట్లు ఇచ్చేందుకు 2024-25 యాక్షన్ ప్లాన్లు రూపొందించాయన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కార్పొరేషన్లన్నీ ఒట్టిపోయాయని, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు ఒక రుణం కూడా ఇవ్వలేదన్నారు. 2014 లో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం ప్రకాశం జిల్లాలో 2015-16 ఆర్థిక సంవత్సరానికి సుమారు 2500 యూనిట్ల రుణాలు మంజూరు చేసిందన్నారు. 2024లో మళ్ళీ అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీకి జతగా, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి కూడా ఉన్నప్పటికీ, లోన్ యూనిట్ల సంఖ్య సగం కంటే తక్కువగా ఉందని నాగేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు లింకు రుణాలతో పాటు, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి బ్యాంకులతో సంబంధంలేని ఎన్ఎస్ఎఫ్డిసి, ఎన్ఎఫ్ఎస్బిసి రుణాలను ఇచ్చేందు కు యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. ఇందుకు స్పందించిన మంత్రి స్వామి మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఒక్క రుణం కూడా ఇవ్వలేదని, ఓటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా తాము రుణాలు ఇస్తున్నామన్నారు. ఫైనాన్స్ క్లియరెన్స్ కోసం ఎదురు చూస్తున్నామని, ఫైనాన్స్ క్లియరెన్స్ రాగానే దరఖాస్తులు తీసుకుంటా మని, రుణాలు మంజూరు చేస్తామని మంత్రి స్వామి నీలం నాగేంద్రకు తెలిపారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

విశాలాంధ్ర-గిద్దలూరు : ఒంగోలులోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మాత్యులు డోలా బాల వీరాంజనేయ స్వామి అధ్యక్షతన జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్, ఆర్డబ్ల్యూఎస్ డిపార్ట్మెంట్ల పై నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి నియోజకవర్గంలోని సాంఘిక సంక్షేమ, ఆర్డబ్ల్యుఎస్, వైద్యశాఖలకు సంబంధించిన సమస్యలను లేవనెత్తి వాటిని పరిష్కారం చేయాలన్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలు గిద్దలూరు నియోజక వర్గంలో 17 ఉన్నాయని, ఇందులో ఏఎస్‌డబ్ల్యుఓ పాయింట్స్ రెండు మాత్రమే ఉన్నాయని, వసతి గృహాలకు పూర్తి స్థాయిలో స్వంత భవనాలు లేకపోవటంతో విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, నూతన స్వంత భవనాల నిర్మాణానికి రెవెన్యూ శాఖ ద్వారా స్థల సేకరణ చేయించి, విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పనకు విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు.. అదే విధంగా బెస్తవారిపేట మండలంలో ఒక ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయాలని, బీసీ సంక్షేమ వసతి గృహాలకు స్థలం కేటాయించాలని, రాచర్ల, మరియు అర్ధవీడు గురుకులాల్లో డిగ్రీ తరగతులను అందుబాటులోకి తేవాలని కోరారు. ఎస్సి, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో ఉద్యోగుల కొరత ఉందని ఆ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. గిద్దలూరు నియోజకవర్గం వెనుకబడిన వర్షాధార ప్రాంతం కావటంతో రాబోయే వేసవి కాలంలో త్రాగునీటి సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నాయన్నారు. గతంలో జలజీవన్ మిషన్ తాగునీరు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికిని పనులు పూర్తి కాలేదని, రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని గిద్దలూరు నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎస్డిఎఫ్ నిధులు మంజూరు చేయవలసిందిగా కోరారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో అన్ని విభాగాల వైద్యులను అందుబాటులోకి తీసుకొని రావాలని, మినరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేసి రోగులకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని, వైద్యశాలలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, వైద్యశాలల్లో సెంట్రల్ ఆక్సిజన్ సిస్టంను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, సంరక్షణ సేవలను అందించడానికి ఫంక్షనల్ ఐసీయూ సెటప్ ను ఏర్పాటు చేయాలని, కంభం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో రోగులకు అన్ని విభాగాల వైద్యులను అందుబాటులోకి తేవాలని కోరారు.

డాక్టర్ వెంగయ్యకు అభినందన

విశాలాంధ్ర-సీఎస్‌పురం : రాజకీయంగా ఉంటూ న్యాయ విభాగంలో ఉన్నత విద్యను అభ్యసించి పిహెచ్‌డీ డాక్టరేట్ సాధించిన మండల టీడీపీ అధ్యక్షులు డాక్టర్ బొమ్మనబోయిన వెంగయ్యను మండలంలోని కోవిలంపాడులో టీడీపీ నాయకులు బుధవారం అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ రాజకీయ నాయకునిగా అన్ని వర్గాల ప్రజల అభిమానాన్ని పొందుతూ ప్రజలకు, సమాజానికి ఉపయోగపడే విధంగా ఉన్నత విద్యను అభ్యసించి న్యాయ విభాగంలో రెవెన్యూ, భూ సమస్యలపై పరిశోధనలో న్యాయ కళాశాలలో ఉన్నత స్థాయి అధికారుల మన్ననలు పొంది డాక్టరేట్ సాధించిన డాక్టర్ వెంగయ్యకు పలువురు అభినందనలు తెలిపి పూలమాలలు శాలువాతో సన్మానించారు. టీడీపీ నాయకులు దొనపాటి మోహన్‌రెడ్డి, అమడసాని బాలకేశవరెడ్డి, బాలకృష్ణారెడ్డి, పాలపర్తి నారాయణరావు, సూర్యనారాయణ, కాశయ్య, జాన్‌బాబు, నరసయ్య, రామకృష్ణం రాజు, రమేష్, బత్తుల వెంకటాద్రి, వెంకటకొండయ్య, గంగయ్య పాల్గొన్నారు.

పెదహాజీ కుమార్తె వివాహానికి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రకు ఆహ్వానం

విశాలాంధ్ర-ఒంగోలు : కనిగిరి నియోజకవర్గం పామూరు పంచాయతీ విశ్రాంత పంచాయతీ కార్యదర్శి కీర్తి శేషులు సత్తార్ కుమారుడు షేక్ పెద హాజీ మలన్, శ్రీమతి పర్వీన్ల కుమార్తె నీహా, తెనాలి వాస్తవ్యులు,జనాబ్ సయ్యద్ జిలాని సాహెబ్, శ్రీమతి హలీమా దంపతుల కుమారుడు సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ల వివాహ వేడుకలు శుక్రవారం పట్టణంలోని అనిల్ గార్డెన్స్ లో నిర్వహిస్తున్న సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డికి పెద హాజీ మలన్, చిన్న హాజీ మలన్‌లు ఆహ్వాన పత్రికతో వివాహానికి హాజరు కావలసినదిగా కోరారు. దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి వివాహానికి ఆహ్వానించిన వారిలో ఉన్నారు.

ఆటో డ్రైవర్లకు కూలీలకు కౌన్సిలింగ్

☞ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు ☞ఎస్సై కోటయ్య

విశాలాంధ్ర-పిసిపల్లి : ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దని అలా తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్థానిక ఎస్సై జి కోటయ్య సూచించారు. ప్రకాశం జిల్లా ఎస్పీ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు వాహనాల తనిఖీలలో భాగంగా బుధవారం పెద్ద అలవలపాడు వద్ద పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని వెళుతున్న ఆటోలను ఆపి ఆటో డ్రైవర్లకు కూలీలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆటోలకు వెనుక వైపు డోర్లను ఓపెన్ చేసి ఉంచరాదని పొగాకు లోళ్ళతో వెళుతున్న ట్రాక్టర్ల డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని ఇరువైపులా డోర్లు తీసి కూలీలను ఎక్కించవద్దని తెలియజేశారు. రహదారిపై ప్రమాదాల నివారణకు ఆటో యజమానులు, డ్రైవర్లు సహకరించాలని అందుకు నిబంధనల మేరకే ఆటోల్లో ప్రయాణికులను తీసుకెళ్లాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులు ఆటోల్లో ఉన్నట్లయితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సును కలిగి ఉండాలని ఆటోలకు సంబంధించిన అన్ని పత్రాలు బీమా తప్పక ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జి కోటయ్య తోపాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

ఎస్ఐ నాగరాజు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని దర్శి అద్దంకి ఆర్ అండ్ బి రోడ్డులో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ముండ్లమూరు ఎస్ ఐ వై నాగరాజు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా బుధవారం అద్దంకి దర్శి ప్రధాన రహదారిలో రోడ్డు వెంబడి ఉన్న చెట్లను ప్రొక్లైన్ సహాయంతో తొలగిస్తున్నారు. ఆ మార్గంలో తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాన్ని గుర్తించి పటిష్ట చర్యలు చేపట్టారు. ప్రధానంగా మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి తన మానవత్వం చాటుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆర్ అండ్ బి రోడ్డులో రోడ్డుకు అడ్డంగా మారి వాహన రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. మండలంలోని ప్రధాన రహదారులను గుర్తించి రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించడం పట్ల వాహనదారులు, ఆ ప్రాంత ప్రజలు ఎస్ ఐ వై నాగరాజును అభినందించి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

25 మద్యం సీసాలు స్వాధీనం

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన బెల్లంకొండ రవీంద్రబాబు వద్దనుండి 25మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ ఐ వై నాగరాజు తెలిపారు. శంకరాపురం గ్రామంలో రవీంద్రబాబు అక్రమ మద్యం అమ్ముతున్నారని సమాచారంతో బుధవారం సాయంత్రం సిబ్బందితో కలిసి దాడి చేయడం జరిగిందన్నారు. రవీంద్రబాబు చుట్టుప్రక్కల మద్యం షాపుల వద్ద నుండి అక్రమంగా మద్యం తీసుకువచ్చి తన బడ్డీ కొట్టులో అమ్ముతున్నట్లు సమాచారం మేరకు దాడి చేశామన్నారు. ఈ దాడిలో 25 అక్రమ మద్యం సీసాలు అతని వద్ద నుండి స్వాధీనం చేయడం జరిగిందన్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వై నాగరాజు తెలిపారు. ఈ దాడిలో పోలీసులు వెంకటేశ్వర్లు, మరియబాబు, పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు

విశాలాంధ్ర-సంతనూతలపాడు : మండలంలోని రుద్రవరం గురవారెడ్డిపాలెం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి పి పావని గ్రామాల్లో సాగు చేసి ఉన్న శనగ పంటను పరిశీలించి సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. రుద్రవరం గ్రామంలో సాగు చేసి ఉన్న వరి పొలంలో ఎన్‌పిఎస్ఎస్ యాప్ నందు పంట స్థితి మరియు చీడపీడల ఉధృతి వివరాలను నమోదు చేశారు. అనంతరం వ్యవసాయ అధికారి సూపర్ చెక్ తనిఖీ నిమిత్తం రుద్రవరం, గురవారెడ్డి పాలెం గ్రామాలలో శనగ పొగాకు పంటలలో ఈ పంట నమోదు చేసిన రైతుల వివరాలను తనిఖీ చేశారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ఎస్ వెంకటరావు,కె వి సుబ్బారెడ్డి రుద్రవరం గురవారెడ్డి పాలెం గ్రామ వ్యవసాయ సహాయకులు సిహెచ్ నిఖిల్ పి సాయిరాం రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

విశాలాంధ్ర-పామూరు : రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని బొట్లగూడూరు సమీపంలో ఒక తోట వద్ద బుధవారం జరిగింది. పోలీసులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పుట్టమనాయుడు పల్లి గ్రామానికి చెందిన మేడిద రమణయ్య(39) ఆటోలో ఇర్లపాడు వెళుతుండగా బొట్లూడూరు సమీపంలోని ఒక తోట వద్ద అదుపుతప్పి తిరగబడింది. దీంతో డ్రైవర్ రమణయ్య తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. అతనిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ఇప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. రమణయ్యకు భార్య, కుమార్తె, కుమారుడు కలరు. ఎస్సై కిషోర్ బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చిన్న వయసులో మృతి చెందటం కుటుంబ సభ్యులు కన్నీటి పర్యాంతమయ్యారు.

పశువైద్యశిబిరం విజయవంతం

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మండలంలోని రేగులచిలక గ్రామంలో అయ్యలూరివారిపల్లి గ్రామాల్లో పశువైద్యశిబిరాలను బుధవారం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఆర్ రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 64 లేగ దూడలకు వ్యాధి నివారణ మందులు 45 గొర్రెలకు నట్టల నివారణ మందులు 36 గేదెలకు, ఆవులకు, చూడు టీకాలను అందించారు. టీడీపీ శ్రీనివాసులు, బి శివన్నారాయణ, హనుమంతరావు, నూర్జహాన్, నవీన్‌కుమార్, నాగరాజు, నాగదేవి, భవాని తదితరులు పాల్గొన్నారు. ఈ వైద్యశిబిరాలకు పశు పోషకులు పాల్గొని పశువులకు టీకాలు వేయించుకున్నారు.

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్

విశాలాంధ్ర - బాపట్ల : ప్రగతిని చాటి చెప్పేలా జాతీయ పండుగను అధికారులు ఘనంగా నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు.గణతంత్ర దినోత్సవం నిర్వహణపై జిల్లా అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు.గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరు,అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా స్టాల్స్ ప్రదర్శించాలన్నారు.18 స్టాల్స్ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జిల్లా ప్రగతిని చాటి చెప్పేలా శకటాల ప్రదర్శన ఉండాలన్నారు.కనీసం 12 శకటాలు ఏర్పాటు చేయాలన్నారు.గణతంత్ర దినోత్సవం నిర్వహించే పోలీస్ కవాతు మైదానాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అతిధులను అలరించేలా ఉండాలన్నారు.అతిధులు,అధికారుల గ్యాలరీ పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు.బ్యారికేడ్లు ఏర్పాటుతో ఎలాంటి సమస్యలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.వేడుకలకు హాజరయ్యే ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు.వరద విపత్తు సమయంలో కష్టపడి పనిచేసిన అధికారులు,ఉద్యోగులకు అవార్డుల ప్రదానం జరుగుతుందన్నారు. ఇందుకోసం అన్ని శాఖలలో ఉద్యోగులను గుర్తించి వారి పేర్లను 23వ తేదీ సాయంత్రంలోగా కలెక్టరేట్‌కు పంపాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్,బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సేవాతత్పరుడు జాష్టి రంగారావు

విశాలాంధ్ర - బాపట్ల : డాక్టర్ జాష్టి రంగారావు సేవకులు మాత్రమే కాదని నిజమైన రాజకీయ నాయకుడని,ప్రస్తుతం మనం ఓట్లు వేసి ఎన్నుకుంటున్న ప్రభుత్వాలు చేయలేని సంక్షేమ కార్యక్రమాలను అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ ద్వారా అద్భుతంగా నిర్వహిస్తున్నారని రాష్ట్ర చేనేత జన సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మాచర్ల మోహన్‌రావు పేర్కొన్నారు.అసిస్ట్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆపరేషనల్ డైరెక్టర్ డాక్టర్ జాష్టి రంగారావు నేతృత్వంలో 50 సంవత్సరములకు పైగా నిర్వహించిన సేవలను అభినందిస్తూ చేనేత జన సమాఖ్య ఆధ్వర్యంలో చీరాల దేవాంగపురిలోని చౌడేశ్వరి దేవాంగ కళ్యాణ మండపంలో బుధవారం ఉదయం ఏర్పాటుచేసిన అభినందన సభలో డాక్టర్ మాచర్ల మోహన్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ స్వచ్ఛందంగా సర్వే నిర్వహించి అవసరమైన పేద కార్మికులకు గ్రామ

రాష్ట్ర చేనేత జన సమాఖ్య

సభ్యులతో ఏర్పడిన స్వతంత్ర కమిటీల ద్వారా సంక్షేమ కార్యక్రమాలను అందిస్తూ పాదరసంగా నిలిచారన్నారు.చీరాల ప్రాంతంలో చేనేత కార్మికులకే కాకుండా బడుగు వర్గాలైన యానాదులు, ముస్లింలు, మత్స్యకారులు,బడుగు బలహీన వర్గాల వారికి విద్య,అక్షరాస్యత, ఆరోగ్యం, పోషకాహారం,గృహ వసతి,వృత్తి శిక్షణ,నీరు,పారిశుధ్యం మొదలగు రంగాలలో సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారని,చీరాల ప్రాంతంలో చేనేత పరిశ్రమ ఉన్నంత కాలం అసిస్ట్ సంస్థ, డాక్టర్ జాష్టి రంగారావు చరిత్రలో ఉంటారని మోహన్‌రావు ప్రశంసించారు.చేనేత జన సమాఖ్య అధ్యక్షులు దేవన వీరనాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో డాక్టర్ జాష్టి రంగారావు చేనేత కార్మికులు పోషకాహార లోపంతో అనారోగ్యపాలవుతున్నారని గుర్తించి పోషక విలువలైన ఆహారాన్ని,పేద చేనేత కార్మికుల జీవిత కళ అయిన సొంత ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఐరన్‌ను అసిస్ట్ సంస్థ తరుపున అందించారని గుర్తు చేశారు.డాక్టర్ సత్రం మల్లేశ్వరరావు,ఒలుకుల శివశంకర్,బీరక సురేంద్ర రంగారావు సేవలను వివరించారు.సన్మాన గ్రహీత డాక్టర్ జాష్టి రంగారావు మాట్లాడుతూ చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో ఉన్నాదని,చేనేత కార్మికులు ఈ సంక్షోభంను తట్టుకోవాలంటే చీరాల ప్రాంతానికి చేనేత పరిశ్రమకు ఒక ప్రత్యేకమైన బ్రాండ్ ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సమాఖ్య నాయకులు దేవన హేమ సుందరరావు, వావిలాల దాశరధి,మునగాల వెంకటేశ్వర్లు, లేళ్ళ భాస్కర్,గుత్తి సదాశివరావు, గుంటూరు మల్లికార్జునరావు, ఓరుగంటి రెడ్డి జన సమాఖ్య ప్రతినిధులు, అసిస్ట్ సంస్థ ప్రతినిధులు, చీరాల ప్రాంత చేనేత కార్మికులు పాల్గొన్నారు.

మార్టూరులో సినీ ఫక్కీలో చోరీ

- కారు అద్దం పగలగొట్టి 1,20,000 చోరీ

విశాలాంధ్ర - మార్టూరు : మండల కేంద్రం మార్టూరులో బుధవారం పట్టపగలే చోరీ జరిగింది.స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో రహదారిపై నిలిపించిన కారు అద్దం పగలగొట్టి అందులో ఉన్న రూ.1.20 లక్షల నగదును చోరీ చేశారు.వివరాలు ఇలా ఉన్నాయి. బల్లికురవ మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన గ్రానైట్ వ్యాపారి మాలపాటి పోతురాజు తన బంధువు ఒకరికి అనారోగ్యంగా ఉండటంతో చికిత్స నిమిత్తం కారులో మార్టూరు తీసుకొని వచ్చాడు.పోతురాజు కారును సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో సర్వీస్ రోడ్డులో నిలిపి తన చేతిలో ఉన్న నగదు బ్యాగును కారు డ్రైవింగ్ సీటు పక్కన గల ఎడమ వైపు సీటులో ఉంచి పేషెంట్‌ను తీసుకొని సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్ళాడు.ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు కారు ఎడమవైపు డోరు దగ్గర ఆగి చాకచక్యంగా కారు డోరు అద్దం పగలగొట్టి ముందు సీటులో ఉన్న నగదు బ్యాగ్‌ను తీసుకొని పారిపోయారు.రెప్పపాటు కాలంలో జరిగిన చోరీని గమనించిన స్థానికులు కేకలు వేసే లోపే నిందితులు పారిపోవడంతో ఆసు పత్రి నుండి వెనక్కు వచ్చిన పోతురాజు కారులో ఉండవలసిన నగదు బ్యాగ్ కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు.విషయం తెలుసుకున్న ఇన్‌ఛార్జి సిఐ కే.వెంకట్రావు ఘటనాస్థలికి చేరుకొని చోరీ జరిగిన తీరును గురించి స్థానికులను,పోతురాజును అడిగి తెలుసుకున్నారు. పోతురాజు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

26న ఎమ్మెల్యే ఏలూరి జన్మదినోత్సవం

- ◆ క్యాంపు కార్యాలయంలో వైద్య శిబిరాలు
- ◆ ఏలూరి యూత్ ఫిట్ నెస్ సెంటర్ ప్రారంభం
- ◆ హాజరుకానున్న మంత్రులు అనగాని,గొట్టిపాటి

విశాలాంధ్ర - మార్టూరు : పర్చూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఈనెల 26న విజనరీ లీడర్ అవార్డు గ్రహీత ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు జన్మదినోత్సవ వేడుకలకు భారీ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.పర్చూరు నియోజకవర్గ వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ శ్రేణులు వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు.ఊరు వాడ సాంబశివరావు జన్మదినోత్సవాన్ని సంబరంలో పండుగ వాతావరణంలో నిర్వహించనున్నారు.ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయం వేదికగా జన్మదినోత్సవ వేడుకలను పలు సేవా కార్యక్రమాలు,వైద్య శిబిరాలు నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నారు.ఈ క్యాంపులో అర్హులైన ప్రతి ఒక్కరికి ఉచితంగా వైద్య పరీక్షలు,స్కానింగ్ పరీక్షలు,ఉచితంగా మందులు అందించనున్నారు.

ఎమ్మెల్యే ఏలూరి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 26న చేపట్టనున్న వేడుకలకు క్యాంపు కార్యాలయం సర్వసిద్ధమవుతుంది. వేలాదిమంది తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు కూటమి నేతలు,పెద్ద ఎత్తున తరలిరానున్న నేపథ్యంలో ఎక్కడ లోటుపాట్లు లేకుండా చర్యలు చేపడుతున్నారు.క్యాంపు కార్యాలయంలో వైద్య శిబిరాలకు,సేవా కార్యక్రమాలకు వేరువేరుగా ఏర్పాట్లు చేపట్టారు. తెలుగుదేశం పార్టీ నాయకులు క్యాంప్ కార్యాలయం ప్రతినిధులు ఏర్పాట్లను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో క్యాంప్ కార్యాలయ ప్రతినిధులు ఏ.శ్రీకాంత్,కామేపల్లి హరిబాబు,కోటపాటి సురేష్,శివరాత్రి శ్రీనివాసరావు,షేక్ ఫారుక్,మిన్నేకంటి రవి తదితరులు పాల్గొన్నారు.

పశు పోషణలో వైద్యుల సూచనలు పాటించాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : పశు పోషకులు పశు పోషణలో వైద్యుల సూచనలు తప్పక పాటించాలని పశుసంవర్ధక శాఖ రేపల్లె ఏడీ డాక్టర్ బి.నాంచారయ్య సూచించారు.బుధవారం మండలంలోని పుల్లమెరక గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశు ఆరోగ్య శిబిరంను ముఖ్యఅతిథిగా ఏడీ హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులందరూ బహువార్షిక పశుగ్రాసాలు సాగును ఉపయోగించుకోవాలని చెప్పారు.పెయ్యి దూడల వీర్యం పశుపోషకుల అందరికీ అందుబాటులో ఉందని ఉపయోగించుకోవాలని తెలిపారు.ఈ శిబిరంలో 200 గేదెలకు,44 దూడలకు పురుగు మందులు అందించడం తోపాటు 54 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు చేయడం జరిగిందని పశు వైద్యాధికారి డాక్టర్ ఎం.హేమ ప్రియ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ జి.రామారావు,ఎస్సీ సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు కొక్కిలిగడ్డ ప్రభాకరరావు,రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి దున్నా సంగీతరావు,సత్యసాయి సేవా సమితి మెంబర్ శ్రీనివాసరావు,గ్రామస్తులు పాల్గొన్నారు.

చింతల,మర్రిపాలెంల్లో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : దోర్నాల మండలంలోని చింతల మరియు మర్రిపాలెం గ్రామాలలో వ్యవసాయ శాఖ వారు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్ గ్రామంలో సాగు చేసిన మినుము, జొన్న, మిరప పంటలను సందర్శించడం జరిగింది. ప్రస్తుతం వ్యవసాయ శాఖ ద్వారా రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా ప్రతి రైతు కు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే రబీ కాలంలో సాగు చేసిన పంటలకు ఈ పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిపూర్ణ, నీలా నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర-బేస్తవారిపేట : మండలంలోని అక్కపల్లి, పీవీపురం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి జక్కం మెర్సి మాట్లాడుతూ 2024 రబీ సీజన్‌లో పంటలు వేసి ఈ-పంట నమోదు చేయించుకోని రైతులు త్వరగా వారికి సంబంధించిన రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి ఈ - పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఉద్యానవన శాఖాధికారి డి. శ్వేత మాట్లాడుతూ ఉద్యాన యాంత్రీకరణ పథకం కింద 5 ఎకరాల లోపు ఉన్న రైతులకు 50శాతం రాయితీతో లక్ష రూపాయలు మించకుండా తైవాన్ స్ప్రేయర్లు అందజేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు రామేశ్వరి, రైతులు పాల్గొన్నారు.